క్లుప్తంగా

ఓటర్ల జాబితా సిద్ధం చేయాలి

మానవపాడు: ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ రాఘవ ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్డుల వారీగా జాబితాను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



అయిజ: మండల కేంద్రంలోని వెంకటేశ్వర నర్సింగ్‌హోమ్‌లో మెడికేర్ వైద్య బృందం ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకుడు రాముడు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

దరఖాస్తుల స్వీకరణ

కేటీదొడ్డి: మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రత్యేక అధికారి పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ బైపీసీలో 5, ఫార్మా టెక్నాలజీ కోర్సులో 20 సీట్లు ఉన్నాయన్నారు. ఈ నెల 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కేటీదొడ్డి: విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈఓ వెంకటేశ్వర రావు అన్నారు. బుధవారం మండలంలోని సోంపురం, యార్సన్‌దొడ్డి, సుల్తాన్‌పురం ప్రభుత్వ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. అభ్యసన సామర్థ్యాలు పరిశీలించారు. అనంతరం రికార్డులు పరిశీలించి పాఠశాల సమస్యలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆర్టీసీ డ్రైవర్ల ఆందోళన

గద్వాల క్రైం: గద్వాల డిపో మేనేజర్ సునీత ఇబ్బందులకు గురిచేస్తున్నారని బుధవారం డిపో ఆవరణలో ప్రైవేటు ఆర్టీసీ బస్సుల డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు ఎల్లగౌడు, రాఘవేంద్ర, విజయ్ మాట్లాడారు. బస్సు సర్వీసుల విషయంలో వివిధ సందర్భాల్లో ఆలస్యంగా వచ్చి సిబ్బందికి రిపోర్టు చేసిన నేపథ్యంలో కక్షపూరితంగా సర్వీస్సులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు వివరించారు. ప్రయాణికులను గమ్యస్థానాల వద్ద చేర్చిన క్రమంలో కొంత ఆలస్యమవుతున్న విషయాలను పరిగణలోకి తీసుకోకుండా ఇబ్బందులకు గురి చేయడం భావ్యం కాదన్నారు. సమస్యలను గుర్తించి న్యాయం చేయాల్సిందిగా పేర్కొన్నారు.

ఎరువులు అక్రమంగా నిల్వ ఉంచితే చర్యలు



రాజోళి: ఎరువులు అక్రమంగా నిల్వ ఉంచినా, అధిక ధరలకు విక్రయించినా చర్యలు తప్పవని టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు హెచ్చరించారు. శాంతినగర్ పట్టణంలో బుధవారం పలు ఎరువుల దుకాణాలు, పెట్రోల్ బంకుల్లో తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లోని నిల్వలు, రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాధ, ఎస్ఐ నాగశేఖర్ రెడ్డి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పంట ధ్వంసం.. కేసు నమోదు

ఉండవెల్లి: మొక్కజొన్న పంటను ధ్వంసం నేపథ్యంలో కేసు నమోదైన ఘటన మండలంలోని కలుగోట్ల బుధవారం చోటు చేసుకుంది. కలుగోట్ల గ్రామంలోని 165 సర్వే నంబర్‌లోని 3 ఎకరాల 11 కుంటల భూమిలో ఈ నెల 3న మొక్కజొన్న పంటను కుర్వ లక్ష్మీదేవి సాగు చేయగా తన భర్త, కుటుంబ సభ్యులు ఈ నెల 19న ఉద్దేశ పూర్వకంగా పంటను ధ్వంసం చేశారని లక్ష్మీదేవి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ఆమె సోదరుడు పెద్దమద్దిలేటి, అల్లుడు, చిన్నరాముడు, సోదరుడి కుమార్తె మహేశ్వరి, భర్త శ్రీనివాసులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు. తన తల్లిదండ్రులు పసుపు కుంకుమ కింద రిజిస్టర్ అవడంతో సోదరులు మాకే సొంతమంటున్నారని ఈ క్రమంలో పంట సాగు చేయడంతో ధ్వంసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అటకెక్కిన నాణ్యత పరీక్షలు



- కలుషిత నీటితో రోగాల బారినపడే అవకాశం
- మిషన్ భగీరథ నీటిలో బ్లీచింగ్ కరువు
- పరీక్షలు చేయాలని ప్రజల వేడుకోలు

మానవపాడు: వర్షాకాలంలో తాగునీరు కలుషితమవుతుండటంతో వ్యాధుల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నట్లు మండల ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి నాణ్యత అనేది ప్రశ్నార్థకంగా మారిందని వాపోతున్నారు. నీటి పరీక్షల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల కిందట ముందుకొచ్చింది. జలజీవన్ మిషన్ పథకం కింద పంచాయతీలకు కిట్లు అందజేసింది. వీటిని చాలా గ్రామాల్లో వాడకుండానే పక్కనే పెట్టేశారు. రసాయనాలు, ఔషధాల కాలం చెల్లడంతో నిరుపయోగంగా మారాయి. ఫలితంగా గ్రామాల్లో నీటి నాణ్యత పరీక్షలు చేయకుండానే కలుషిత నీటిని సరఫరా చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లోరోస్కోప్ కిట్ల పంపిణీ

రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం కింద గ్రామ పంచాయతీలకు క్లోరోస్కోప్ కిట్లు సరఫరా చేసింది. వీటి ద్వారా నీటి నాణ్యత పరీక్షా విధానంపై మంచినీటి సహాయకులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. కిట్ల ద్వారా ప్రతిరోజు మూడు విభాగాలుగా నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని సూచించారు. నీరు విడుదలయ్యే ట్యాంక్‌ల వద్ద, వీధి కుళాయి వద్ద అలాగే నల్లా వద్ద పరీక్షలు చేయాల్సి ఉంటుంది. గ్రామాల్లోని తాగునీటి నీటి ట్యాంకుల్లో పరిమాణానికి అనుగుణంగా బ్లీచింగ్ చేయాల్సి ఉంటుంది.



మానవపాడులో రోడ్డుపై మిషన్ భగీరథ నీటి సరఫరా

మంచినీటి సహాయకులకు శిక్షణ

మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో మంచి నీటి సహాయకులను నియమించి వారికి నీటి నాణ్యత పరీక్షల నిర్వహణపై అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీలకు రెండేళ్ల కిందట నాకో మీటర్, వాటర్ క్వాలిటీ ఫీల్డ్‌టెస్ట్ కిట్లు అందజేశారు. ఒక్కో కిట్టు ధర రూ. 1,000 ఉంటుంది. కిట్ల సరఫరా చేసిన అనంతరం వాడకంపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పరిశీలన చేయకపోవడంతో చాలా చోట్ల కిట్లను మూలన పడేశారు.

ప్రశ్నార్థకంగా మంచనీటి కేంద్రాల పరిస్థితి

మంచినీటి కేంద్రాల్లో తాగునీటిలో పీహెచ్, క్షార గుణం, ఇనుము తదితర ఆమ్లాలు, క్షారాలు ఎంత పరిమాణంలో ఉన్నాయో గుర్తించేందుకు సాంకేతిక సహాయకులు గ్రామాల్లో పరీక్షలు నిర్వహించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో పారిశుద్ధ్య లోపం, పైపులైన్లు లీకేజీలతో నీటి వనరులు చుట్టూ మురుగు పేరుగుపోతుందని దీంతో తాగునీరు కలుషితమవుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అవగాహన కల్పించాలి



గ్రామాల్లో కలుషిత నీరు తాగటం గుండా వచ్చే వ్యాధులు, పరిణామాలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలి. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలి.
–ఆనందరెడ్డి, మానవపాడు

నీటిని శుద్ధి చేయాలి



గ్రామాల్లో ప్రజలకు అందించే మిషన్ భగీరథ నీటిని బ్లీచింగ్ చేయించి సరఫరా చేయాలి. మంచి నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించిన తాగునీటిని సరఫరా చేయాలి. – బజారన్న, మానవపాడు

స్వచ్ఛమైన నీరు తాగాలి



గ్రామాల్లో నీటి నాణ్యతపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలి. కలుషిత నీరు తాగడం వలన రోగాల బారిన పడే అవకాశం ఉంది. వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీరు తాగాలి.
– హేమమానస, వైద్యురాలు, మానవపాడు.

పరీక్షలు నిర్వహిస్తున్నాం

గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్‌ను నీటిశుద్ధికి ఉపయోగిస్తాం. గ్రామాల్లో నీటి పరీక్షలు నిర్వహిస్తున్నాం. గ్రామాల్లో తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటున్నాం.
–రాఘవేంద్ర మిషన్ భగీరథ ఏఈ

మహిళల ఉపాధికి మరింత ప్రోత్సాహం



ప్రదర్శన ఉత్పత్తులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ దశరథ్

గద్వాల: పట్టణ ప్రాంతాల్లోని మహిళా సంఘాల సభ్యులకు మరింత తోడ్పాటు అందిస్తూ ఉపాధి కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మున్సిపల్ కమిషనర్ దశరథ్ అన్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో వంద రోజుల ప్రణాళికలో భాగంగా మహిళా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మహిళా సంఘాలు సభ్యులు తయారు చేసిన వివిధ రకాల ఉత్పత్తులను పరిశీలించారు. ప్రదర్శనలో వెదురు బుట్టలు, వన్‌గ్రాం గోల్డ్, హోంఫుడ్, గారెలు, లడ్డులు, రాగిజావ వంటి వివిధ రకాల ఆహార పదార్థాలను ఉంచారు. ఒక్క మార్పు అభివృద్ధికి మలుపు, స్వచ్ఛతపై తొలి అడుగు వంటి కార్యక్రమాలతో మహిళా సంఘాలకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈ గోపాల్, రాజేశ్, శ్రీకర్, తిమ్మన్న, నిజాముద్దీన్, మహాలక్ష్మి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

భారతి సిమెంట్ నూతన రకం ఆవిష్కరణ

గద్వాల: సిమెంట్ రంగంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న వికాట్ గ్రూప్‌కి చెందిన భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ నూతన రకాన్ని విడుదల చేస్తున్నట్లు వికాట్ గ్రూప్ కంపెనీ రీజనల్ మేనేజర్ నాగేశ్వర్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలోని రంగస్వామి ట్రేడర్స్‌లో సబ్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతి సిమెంట్ మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్ రకాలతో పోలిస్తే నిర్మాణ ప్రక్రియ చాల వేగవంతంగా పూర్తవుతుందన్నారు. నిర్మాణం ధృఢత్వం అధికంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జి, రహదారులకు భారతి సిమెంట్ సరైన ఎంపికని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ అధికారి విజయ్‌భాస్కర్, టెక్నికల్ అధికారి నితిన్, సబ్ డీలర్లు పాల్గొన్నారు.



సిమెంట్ నూతన రకాన్ని ఆవిష్కరణ చేస్తున్న భారతి సిమెంట్ ప్రతినిధులు

ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు

అయిజ: ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యానవన అధికారి ఎంఏ అక్బర్ అన్నారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో టీజీ ఆయిల్‌ఫెడ్ సహకారంతో అయిజ, గట్టు మండలాలకు చెందిన వ్యవసాయ విస్తరణ అధికారులు, అసిస్టెంట్ ప్రోగ్రాం అధికారులు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లతో ఆయిల్‌పాం సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 2025– 26 ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు 3,500 ఎకరాలలో ఆయిల్‌పాం పంట సాగుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఒక్కసారి పంట వేసుకుంటే 30 సంవత్సరాల వరకు రైతులకు స్థిరమైన ఆదాయం వస్తుందన్నారు. చీడపీడల బెడద తక్కువగా ఉంటుందన్నారు. అంతర పంటలతో అదనపు ఆదాయాన్ని పొందవచ్చని సూచించారు. పంట నిర్వహణకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం రైతుల బ్యాంక్ ఖాతాల్లో రూ. 4,200 జమ చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఆయిల్ ఫెడ్ జిల్లా ఇన్‌చార్జ్ శివనాగిరెడ్డి, ఉద్యానశాఖ గద్వాల డివిజనల్ అధికారి రాజశేఖర్, హార్టీలక్చర్ ఆఫీసర్ మహేష్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అక్బర్

గాయత్రీ మహాజ్ఞాన యజ్ఞ కలశపూజ

రాజోళి: ఈ నెల 25, 26, 27 తేదీల్లో కర్నూలులో జరుగు 108 కుండముల గాయత్రీ మహాజ్ఞాన యజ్ఞంలో పాల్గొని తరలించాలని అఖిల విశ్వగాయత్రీ పరివార్ సభ్యులు అన్నారు. పూజకు వివిధ నదుల నుంచి తెచ్చిన జలాల కలశాలను ఆయా ఆలయాల్లో పూజలు చేసే క్రమంలో భాగంగా బుధవారం శాంతినగర్ పట్టణంలోని రామాలయంలో కలశాన్ని సీతారాములు, శివుడి వద్ద ఉంచి విశేష పూజలు చేశారు. సందీప్, సతీష్, కిషోర్‌కుమార్, వజ్రం రమణారెడ్డి, ఉరుకుందు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



రాజోళి: మండల కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు శశికుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఎస్ఐ గోకారికి పోలీసుస్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. రాజోళి గ్రామం ఏపీ– తెలంగాణకు సరిహద్దులో ఉండటం, తుంగభద్రా నదీ పరివాహక గ్రామంగా ఉండటంతో సీసీ కెమెరాల ఏర్పాటు ముఖ్యమన్నారు. మండలంలోని 11 గ్రామాల ప్రజలతో పాటు, శాంతినగర్, కర్ణాటక నుంచి రాజోళి మీదుగా ఏపీకి వెళ్లే వాహనాలు, ఏపీ నుంచి కర్ణాటక వెళ్లే వాహనాలతో నిత్యం రద్దీగా ఉండే గ్రామం కావడంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అంజనేయులు, గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సంస్థల ప్రశంస



గద్వాలటౌన్: కామన్‌వెల్త్ ఆధ్వర్యంలో హార్ట్‌ఫుల్‌నెస్, శ్రీరామ్‌చంద్ర మిషన్ సంయుక్తంగా జాతీయ స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీలకు గాను స్థానిక ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాలకు ఆయా సంస్థల నుంచి ప్రశంసలు వచ్చాయి. అంతర్జాతీయ సంస్థలు నిర్వహించిన పోటీలకు పాఠశాల నుంచి 107 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఒకే పాఠశాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు పోటీలకు హాజరుకావడంపై ఆయా సంస్థలు విద్యార్థుల ప్రతిభను కొనియాడినట్లు హెచ్‌ఎం రేణుకాదేవి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ప్రశంస పత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో గైడ్ టీచర్ కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొండచిలువ కలకలం



అయిజ: పట్టణ శివారులోని జమ్ములమ్మ దేవాలయం సమీపంలోని వాగులో కొండచిలువ సంచరిస్తున్నట్లు స్థానికులు గుర్తించారు. బుధవారం కొండచిలువ గొర్రెను తింటుండగా గొర్రెల కాపరులు గమనించారు. ఇటీవల కొండచిలువ వాగు పరిసరాల్లో తరచూ కనిపిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. అటవీ శాఖ అధికారులు కొండ చిలువను పట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బకాయి బిల్లులు విడుదల చేయాలి



అలంపూర్‌లో డీటీకి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు



అయిజలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అలంపూర్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయి బిల్లుల తక్షణమే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్ కోరారు. పట్టణలోని తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘం నేతలతో డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్‌రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో మూడు దశల పోరాట కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలన్నారు. పెండింగ్ డీఏలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ సంఘ నాయకులు రాముడు, బయన్న, సువిజ్ఞానం, మాబుసాబ్, వెంకట్రాముడు, వెంకటస్వామి పాల్గొన్నారు.

అయిజ: ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) నాయకులు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జ్యోతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. 2023 జూలై నుంచి అమలు కావాల్సిన పీఆర్‌సీని ప్రభుత్వం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సుధాకర్, భాస్కర్, రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రభాకర్‌కు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. యుఎస్‌పీఎస్ మొదటి దశలో భాగంగా ఉపాధ్యాయ, ఉద్యోగ, విద్యారంగ పెండింగ్ సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఎస్‌యుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్, జిల్లా కమిటీ సభ్యులు కుమార్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

ఇటిక్యాల: రానున్న స్థానిక ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఉదంగాపురం గ్రామంలో పార్టీ మండలాధ్యక్షుడు షేక్ అబ్దుల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గ్రామాల్లో రైతువేదికలు, పల్లె ప్రకృతివనం, వైకుంఠధామాలు, టాయిలెట్స్, రైతులకు సబ్సిడీ ఎరువులు, విశ్వకర్మ, ముద్రలోన్లు, సీసీరోడ్లు, చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికహారం తదితర కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు నూట అరవై అబద్ధాలు చెప్పి గద్దెనెక్కిదన్నారు. బీఆర్ఎస్ నాయకులు లిక్కర్, కాళేశ్వరం, టెలిఫోన్ ట్యాంపరింగ్, అనేక కుంభకోణాలు, కుటుంబ గొడవలతో రాష్ట్రాన్ని నాశనం చేశారన్నారు. గ్రామ ప్రజలు బీజేపీకి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు తిమ్మారెడ్డి, కిషోర్, నాగముని, గజేంద్ర, మునీందర్‌రెడ్డి, మహేందర్, గోవిందు, మహేష్, పరమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.



సాతర్లలో మాట్లాడుతూన్న బీజేపీ నాయకులు

ఎన్నికల్లో సత్తా చాటుదాం

కేటీదొడ్డి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మీర్జాపురం వెంకటేశ్వరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సన్నాహక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలల్లో విజయం కోసం తీసుకునే వ్యూహాలు, ప్రధాన సమస్యలపై వివరించారు. కార్యక్రమంలో శ్రీపాదరెడ్డి, అనిమిరెడ్డి, సూర్యకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండలస్థాయి కార్యకర్తల సమావేశం

ధరూరు: రానున్న స్థానిక సంస్థల ఎన్నిలకు ప్రతి కార్యకర్త సంసిద్ధం కావాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాసు హనుమంతునాయుడు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మండల స్థాయి కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రేవంత్ సర్కార్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా.. పలు మోసాలకు పాల్పడుతుందని ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కాంగ్రెస్‌ను ఎండగట్టి కార్యకర్తలు ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావుపూలే, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండా ఎగురవేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో రాజారెడ్డి, వెంకటేష్‌నాయుడు, శ్రీనివాస్‌గౌడ్, నూర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

విద్యా సంస్థల బంద్ విజయవంతం



అయిజలో మాట్లాడుతున్న పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు హరీశ్



అలంపూర్ ప్రభుత్వ కళాశాల నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

అలంపూర్/గట్టు/మల్దకల్/అయిజ: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. అలంపూర్ పట్టణంలో రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు బుధవారం విద్యా సంస్థల బంద్‌ను నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు విద్యా సంస్థల సమస్యల పరిష్కారం కోరుతూ.. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో నెలకొన్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రైవేటు పాఠశాల దోపిడీని ఆరికట్టాలన్నారు. విద్యా వ్యవస్థలను పటిష్ట పర్చడానికి విద్యాశాఖ మంత్రిని నియమించాలన్నారు. విద్యాశాఖలో ఖాళీగా ఉన్న జిల్లా విద్యాధికారి, ఎంఈఓ, ఉపాధ్యాయుల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. పెండింగ్ బిల్లులను తక్షణమే విడదల చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు గణేష్, ప్రశాంత్, రిషి, వేదస్, శివశంకర్, సాయికిరణ్‌తేజ, రాహుల్, లోకేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

- విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు తరగతులు బహిష్కరించారు. గట్టు, రాయాపురం, ఆలూరు, ఆరగిద్ద, మాచర్ల గ్రామాల్లో పీడీఎస్‌యూ నాయకులు పాఠశాలలకు చేరుకుని తరగతుల బహిష్కరణ చేయించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ మండల అధ్యక్షుడు రామిరెడ్డి, నాయకులు రఫీ, పల్లయ్య, సుమంత్, వీరేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.
- ప్రైవేటు పాఠశాలలో అధిక ఫీజుల వసూలను ప్రభుత్వం వెంటనే నియంత్రించి ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం జిల్లా నాయకులు హలీంపాషా, ప్రవీణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మల్దకల్‌లో పాఠశాలను బంద్ చేయించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ చేశారు.
- వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన బంద్ విజయవంతమైనట్లు పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు హరీష్ అన్నారు. అయిజ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల వద్ద ఆయన మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడిని అరికట్టేందుకు ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టం తీసుకు రావాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు క్రాంతికుమార్, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

అయిజ: మండల కేంద్రంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులో భాగంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ నరేందర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలం కేంద్రం ఎక్లాస్‌పురం, బింగుదొడ్డి, జడ్డొడ్డిలో సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు అమావాస్య పూజలు

ఇటిక్యాల: మండల పరిధిలోని షాబాద్ గ్రామంలో గురువారం ఆషాడ అమావాస్య, చౌడేశ్వరి జయంతిని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి నాగన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గణపతి పూజ, అభిషేకం, పుష్పాలంకరణ, కుంకుమార్చన తదితర క్రతువులు ఉంటాయన్నారు.